క్లుప్తంగా

సన్మానం



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియా స్టోర్‌కు ఇటీవల బదిలీపై వచ్చిన ఈఅండ్‌ఎం ఎస్‌ఈ రాజబాబును శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు సన్మానించారు. స్టోర్ ఆవరణలో శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఐటీయూ నాయకులు కంపేటి రాజయ్య, గట్టయ్య, అంకూస్, రమేష్, శ్రీనివాస్, శ్యామ్‌బాబు, తిరుపతి, అశోక్ పాల్గొన్నారు.

28న సర్వసభ్య సమావేశం

మల్హర్: ఈనెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్యామ్ సుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండల కేంద్రం తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చింతలపల్లి మల్హర్ రావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

కాటారం: రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని ఆర్యవైశ్య సంఘం నాయకులు తోట సతీశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఆర్యవైశ్య కార్పొరేషన్ అమల్లోకి తెచ్చి ఆర్యవైశ్య కులస్తుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో పేద ఆర్యవైశ్యులకు ఎనలేని లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుకు ఆర్యవైశ్యుల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం..

వెంకటాపురం(కె): కొమరంభీం కాలనీకి చెందిన ఆదివాసీలకు న్యాయం జరిగే వరకూ గోండ్వానా సంక్షేమ పరిషత్ వారికి అండగా ఉండి పోరాటం చేస్తుందని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కొమురంభీం కాలనీలో పూనెం సాయి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమరంభీం కాలనీకి చెందిన పది ఆదివాసీ కుటుంబాలు 30 సంవత్సరాలుగా కాలనీ సమీపంలోని ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. పూనెం ప్రతాప్, రాజబాబు, లక్ష్మయ్య, రాజేష్, లోకేష్, రమేష్ ఉన్నారు.

అక్రమ పట్టాలను రద్దు చేయాలని వినతి

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల అక్రమ పట్టాపాస్ పుస్తకాలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ మాట్లాడుతూ.. మండలంలో ఆలుబాక జెడ్‌లో అనేక మంది గిరిజనేతరులు అక్రమ పట్టాలు చేసుకున్నారని అధికారులు విచారణ చేసి పట్టాలను రద్దు చేయాలని కోరారు. కృష్ణబాబు, నేత్రనందకుమార్, సాంబ శివరావు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మొగుళ్లపల్లి: ఉపాధ్యాయులతో విద్యార్థులు

మొగుళ్లపల్లి: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఆట, పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు తక్కళ్లపల్లి వెంకన్న తన తండ్రి బుచ్చయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, తదితర సామగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలన్నారు. పరీక్ష సామగ్రిని వితరణ చేసిన ఉపాధ్యాయుడు వెంకన్నకు పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్, కల్యాణి, అనిల్‌కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీణ్, లలిత, విజిత, శ్రీకల, చందర్, స్పందన, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి అర్బన్: మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని గొల్లబుద్దారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జంగేడు ప్రాథమిక పాఠశాలలో పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అలాగే 10వ, 5వ తరగతి పూర్తి చేసుకుంటున్న సందర్భంగా విద్యార్థులకు వీడ్కోలు సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలో ఎంఈఓ దేవానాయక్, ప్రధానోపాధ్యాయులు మండల రవీందర్‌రెడ్డి, పద్మావతి, రమేష్, ఉపాధ్యాయులు శ్రీకాంత్‌రాజ్, యాకుబ్‌పాషా, అయోధ్య, రమేష్, తిరుపతి, శరత్‌బాబు, రాములు, కృష్ణలు పాల్గొన్నారు.



భూపాలపల్లి అర్బన్: గొల్లబుద్దారంలో..

కాటారం: మండలంలోని ఒడిపిలవంచ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పదవి తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం, పాఠశాల వార్షికోత్సవ వేడుక ఆకట్టుకుంది. విద్యార్థులు పాఠశాలలో ఎదుర్కొన్న తమ అనుభవాలను, ఉపాధ్యాయులపై తమ అభిమానాన్ని తెలియపరస్తూ భావోద్వేదానికి గురయ్యారు. హిందీ ఉపాధ్యాయుడు రాజారాం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి, ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గండు రాజబాబు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, చంద్రశేఖర్, సురేశ్, మధు, పుష్పలీల, రాజారం, మంజుల, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కాటారం: నృత్యం చేస్తున్న విద్యార్థులు

10జీపీఏ సాధిస్తే విమాన ప్రయాణం

రేగొండ: పదవ తరగతి వార్షిక పరీక్షల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులను దేశంలో కోరుకున్న ప్రాంతానికి విమాన ప్రయాణాన్ని చేపిస్తానని భాగిర్తిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవూరి అనితారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓనపాకల రాజయ్య, వేల్పుల రాజు, కొండ శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, వేల్పుల రాజు, సంపత్, భాగ్యలక్ష్మి, అబ్బోజు అనురాధ, సుదమల్ల మురళి, సూదం సాంబమూర్తి, సనత్‌కుమార్, గుం రమేష్, చెన్న సరిత, చంద్రమౌళి, రఘు, తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు

పశువులకు టీకాలు వేయించాలి

చిట్యాల: పశువులకు గాలికుంటు వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఎల్.విజయలక్ష్మి రైతులను కోరారు. శుక్రవారం పశువైద్య–పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం మండల కేంద్రంతో పాటు మండలంలోని నైన్‌పాక, చల్లగరిగలో ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా బాధ్యతగా రైతులు చూసుకోవాలని కోరారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఈ టీకాల కార్యక్రమం రెండు నుంచి ఐదు రోజులు ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని చల్లగరిగలో 52, నైన్‌పాకలో 256, చిట్యాలలో 102 పశువులకు టీకాలు వేయించడం తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు వెంకన్న, మహతి, ఎంపీడీఓ రామయ్య, ఎంపీఓ రామకృష్ణ, గోపాలమిత్ర, పశు మిత్రులు, వ్యాక్సినేటర్‌లు, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

కాన్షీరాం జయంతి వేడుకలు

చిట్యాల: మండల కేంద్రంలో మాన్యశ్రీ కాన్షీరాం జయంతి వేడుకలు శుక్రవారం అండేడ్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి మ్యాదరి సునీల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీ కృష్ణ హాజరై కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప మహానీయుడని అన్నారు. ఓటు హక్కుతోనే రాజ్యాధికారం సాధించవచ్చని, ఓటును అమ్ముకోవద్దని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కోరారు. కళాకారుల ఐక్య వేదిక మండల అధ్యక్షుడు గూడెపు రజనీకాంత్, జానపద గేయ రచయిత దాసారపు నరేష్, బానోత్ రాజు నాయక్, ఏవైఎస్ నాయకులు భద్రయ్య, శ్రీనివాస్, రాజమౌళి, తిరుపతి పాల్గొన్నారు.

కాటారం: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు మాన్య శ్రీ కాన్షీరాంజయంతి వేడుకలు మండల కేంద్రంలో ఆ పార్టీ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు రామిళ్ల రాకేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కందుగుల రాజన్న, మంథని నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్ మహమ్మద్ అమీన్, మహిళా నాయకురాలు రామిల్ల రజిత, అహ్మద్, మెట్టు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న మధువంశీకృష్ణ

మోటార్లు చోరీ

మొగుళ్లపల్లి: మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామంలో ఇద్దరి రైతులు వ్యవసాయ బావులకు అమర్చిన విద్యుత్ మోటార్లను గురువారం రాత్రి గుర్తు తెలియన వ్యక్తులు దొంగిలించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు జక్కుల రమేష్, గండు కుమారులు తెలిపారు.

గొప్ప విజయాలు సాధించాలి



ఫ్రీజర్‌ను అందజేస్తున్న సంజీవరావు

టేకుమట్ల: ప్రతి ఒక్కరూ జీవితంలో గొప్ప విజయాలను సాధించాలని అప్పడే మానసిక ప్రశాంతత ఉంటుందని రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ పుల్ల సంజీవ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని దుబ్యాల గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్స్, అలాగే యూత్ పిల్లలకు వాలీబాల్ నెట్, వాలీబాల్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుబ్యాల గ్రామానికి తనుకు ఎంతగానో అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. విద్యను ఆయుధంగా చేసుకుని జీవితంలో గొప్ప విజయాలు సాధించాలని అన్నారు. అనంతరం గ్రామస్తులు రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ సంజీవ రావును ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ అనిత సంపత్‌రావు, సొసైటీ డైరెక్టర్ రామస్వామి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బిక్కినేని సంపత్‌రావు, కారోబార్ బిళ్లకంటి సంపత్‌రావు, బీఎస్పీ మండల అధ్యక్షుడు సంగి రవి, గ్రామస్తులు సరోత్తంరావు, రాజయ్య, శేఖర్, లేనిన్, అంజి, వంశీ, మణిపాల్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య రాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ యార సుజాత అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎవరైన అక్రమంగా ఇసుక రవాణా చేస్తే దొంగలను పట్టుకోని మైనింగ్ కేసులు నమోదు చేయాలని తహసీల్దార్ సునీతకు, ఎస్సై అశోక్‌కు సూచించారు. ఇళ్లు కట్టుకునే వారికి, అభివృద్ధి పనులకు మాత్రమే ఇసుక పర్మిషన్ ఇవ్వాలని తెలిపారు. పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుక తరించడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీటికి, తాగు నీటికి సమస్య తలెత్తుతుందని పేర్కొన్నారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి నోటీసులు జారిచేయాలని ఎంపీడీఓ జయశ్రీని ఆదేశించారు. రంగాపురం గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదంటూ వైస్ ఎంపీపీ రాజేశ్వరరావు తెలిపిన అంశానికి ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కారించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఆజీఎస్ కింద ప్రతి కూలీకి 100రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. పంట పొలలకు మట్టిని పోయించుకునే రైతులకు అభ్యంతరం చెప్పద్దని అధికారులకు సూచించారు. మండలంలోని తెగిపోయిన అన్ని గ్రామాల చెరువులకు మరమ్మతుల చేపట్టినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని, ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జోరుక సదయ్య, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, వైస్ ఎంపీపీ రాజేశ్వరరావు, ఎంపీటీసీలు సుధకార్, రాంచంద్రారెడ్డి, నరహరి కల్పన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కలిగేలా శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు గోపగాని విక్రమ్, యార దేవేందర్ ఆధ్వర్యంలో పోటీ చేసే అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, అధికారులు, ఓటర్లు, ఓటు వినియోగం, బ్యాలెట్ బాక్సు, ఓట్ల లెక్కింపు తదితర వాటిని ఏర్పాటు చేసి పోలింగ్ సరళిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హైమవతి మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, నిజాయితీగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, మహేష్, రాకేష్, కొమురెల్లి, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పట్టణ అభివృద్ధికి కృషి

ములుగు: ములుగు పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తా అని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్ యాదవ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రంగారావుపల్లి సమీపంలో రూ.6లక్షలతో నేషనల్ హైవే నుంచి అయ్యప్పస్వామి టెంపుల్ వరకు, రూ.రెండు లక్షలతో వీవర్స్ కాలనీలకు మంజూరైన సీసీ రోడ్డు పనులను ఎంపీపీ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దీంతో పాటు బృందావన కాలనీ, చుట్టూ పక్కల రూ.14లక్షలతో సైడ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అవసరం ఉన్న చోట సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులు చేపట్టడానికి తన వంతు కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొర్రె సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ జానమ్మ, గడ్డమీది భాస్కర్, రామారావు, రాజు, చిన్న రాజు, గణేష్, శ్రీను, సంపత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

వెంకటాపురం(ఎం): మండల కేంద్రానికి చెందిన మామిడిశెట్టి కమలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం మంత్రి సీతక్క తనయుడు, కాంగ్రెస్ నాయకుడు ధనసరి సూర్య పరామర్శించారు. కమలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిల్కూరి అయిలయ్య, జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, మామిడిశెట్టి కోటి, ధర్మతేజ, చాంద్‌పాషా, రాజేశ్వర్‌రావు, భూస గణేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ఏటూరునాగారం: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్



ములుగు: మాట్లాడుతున్న సమ్మయ్య

ఏటూరునాగారం: వినియోగదారులు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.చిన్న అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల కామర్స్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ వినియోగదారుల రక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జె.చిన్న మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నడుస్తున్న వ్యాపారాలలో వినియోగదారులు అనేక రకాలుగా మోసపోతున్నారన్నారు. ముఖ్యంగా ఈ–కామర్స్ ద్వారా ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోళ్లు, అమ్మకాల ద్వారా జరిగే మోసాలు, డిజిటల్ పేమెంట్‌ల ద్వారా జరిగే మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధ్యాపకులు డాక్టర్ ఎం.విజయలక్ష్మి, ఎం.ఘన్‌సింగ్, టి.రమేష్‌కుమార్, కనీస్ ఫాతిమా, వెంకటయ్య, జ్యోతి పాల్గొన్నారు.

వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలి

ములుగు: వస్తువుల కొనుగోలు విషయంలో వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ సమ్మయ్య సూచించారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాలలో వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల వినియోగదారుల మండలి కన్వీనర్ డాక్టర్ యాకూబ్, సభ్యురాలు ఉమాదేవి, అకాడమిక్ కో ఆర్డినేటర్ వెంకన్న, అధ్యాపకులు మహేందర్ ఉన్నారు.

పిల్లలను బయటికి పంపొద్దు

కన్నాయిగూడెం: విద్యార్థులకు శుక్రవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం అవడంతో మధ్యాహ్నం ఇంటికి వస్తున్న పిల్లలను తల్లిదండ్రులు బయటికి వెళ్లకుండా చూసుకోవాలని ఎస్సై సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటికి వచ్చిన విద్యార్థులను ఈతలు కొట్టడానికి మండలంలోని జలాశాయాలకు, చెరువు, కుంటలు, గోదావరిలోకి వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రత్తలు ఉన్నందున వడగాలులు తగిలే ప్రమాదాలు ఉన్నాయని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



రేగొండ: అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ సుజాత



మహాముత్తారంలో..

రేగొండ: పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటేనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సామాల సుజాత అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొడవటంచ అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలతో పాటు, పోషకాహార పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రజిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మహాముత్తారం: పౌష్టికాహారం తీసుకోవడం వలన గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ప్రేమ్‌నగర్ అంగన్‌వాడీ కార్యకర్త చారణ్‌బాయి అన్నారు. పోషణ్ పక్వాడా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ప్రేమ్‌నగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే లాభాలగురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వీఓ అధ్యక్షురాలు ప్రమీల, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని వెలిశాల, రామకిష్టాపూర్(వీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు పూర్ణిమ, ఝాన్సీ, సునీత, ఉమాదేవి, రజిత, హేమలతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సు చిత్ర, అంగన్‌వాడీ ఆయాలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.



టేకుమట్లలో..

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గోవిందరావుపేట: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని బుస్సాపూర్, చల్వాయి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ పరిశీలించారు. పోలింగ్ సెంటర్లలో గతంలో నిర్వహించిన ఎన్నికల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను పోలీస్ శాఖ ముందస్తుగా ఏర్పాటు చేస్తుందని అన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై